ప్రజాశక్తి

బుధవారం 28 డిసెంబర్ 2022 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఛానల్‌ను పొడిగించేందుకు
భూసేకరణ ప్రారంభించాలి

కలెక్టర్‌కు ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో రైతుల వినతి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించే ప్రక్రియలో భాగంగా పర్చూరు మండలంలో భూసేకరణ ప్రారంభించేందుకు నోటిఫికేషన్ ఇచ్చి.. ఇందుకు తగిన నిధులు కేటాయించి.. 50 గ్రామాల ప్రజలకు సాగు నీరు, తాగునీరు అందించాలని శాసనమండలి సభ్యులు కెఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో రైతుల బందం బాపట్ల కలెక్టర్‌కు విజయకృష్ణన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలోని రైతులు, సామాన్య ప్రజలు సాగునీరు, తాగు నీరు కోసం 85 సంవత్సరాల నుంచి పోరాడుతున్నారన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపు ద్వారా పర్చూరు, చిలకలూరిపేట, ఎడ్లపాడు, కాకుమాను, పెదనందిపాడు, ప్రత్తిపాడు మండలాల పరిధిలోని 49 గ్రామాలకు చెందిన 48 వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు లభిస్తాయన్నారు. దీర్ఘకాలంగా ఈ ప్రాంతం కరువులకు, వరదలకు ప్రసిద్ధి చెందినదని, పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. నల్లమడ వాగులో పట్టణ వ్యర్థాలు, మురుగు నీరుతో, కలుషితమైన నీటితో సాగు చేయడం వల్ల పొలాలు చవుడుబారిపోతున్నాయని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ కాలువ పొడిగింపు పనులు ముందుకు ▶ 2లో

మంత్రి సురేష్‌కు
సిఎం జగన్ పరామర్శ

సురేష్ మాతృమూర్తి థెరీసమ్మకు ఘన నివాళి

థెరీసమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను, కుటుంబసభ్యులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పరామర్శించారు. మంత్రి సురేష్ తల్లి థెరీసమ్మ అనారోగ్యంతో సోమవారం మృతిచెందిన విషయం తెలిసిందే.. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మంగళవారం యర్రగొండపాలెంలోని మంత్రి సురేష్ నివాసానికి వచ్చారు. మంత్రి సురేష్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడారు. థెరీసమ్మ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబసభ్యులతో పాటు మంత్రి సురేష్‌ను ఓదార్చారు. మంత్రి సురేష్‌ను పరామర్శించిన వారిలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్లమెంట్ సభ్యులు బీద మస్తాన్‌రావు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, శాసనమండలి సభ్యులు పోతుల సునీత, తూమాటి మాధవరావు, శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి, టిజెఆర్ సుధాకర్‌బాబు, కె.నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, మాజీ ఎంఎల్‌ఏ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ కె.కనకారావు, పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ మాదాసి వెంకయ్య, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద పలువురు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు ▶ 2లో

మంత్రి సురేష్‌ను పరామర్శిస్తున్న సిఎం జగన్

కార్మికులు, ఉద్యోగులతో పెట్టుకుంటే..
ఖబడ్దార్

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు
- చీమకుర్తిలో కదం తొక్కిన కార్మికులు
- ప్రారంభమైన సిఐటియు జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-చీమకుర్తి

కార్మికులతో, ఉద్యోగులతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాగించలేదని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం సిఐటియు 12వ జిల్లా మహాసభల సందర్భంగా భారీ ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం 27 చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లు తెచ్చిందన్నారు. బిజెపి చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను రాష్ట్రంలో మూడు పార్టీల నేతలు మద్దతు తెలుపుతున్నారని విమర్శించారు. వ్యతిరేకించే దమ్ము ఆ ముగ్గురికీ లేదని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ▶ 2లో

ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

బహిరంగ సభలో అభివాదం చేస్తున్న నాయకులు

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

29న పి.గుడిపాడు వద్ద విమానాల ల్యాండింగ్ ▶ 4లో

మాండూస్ తుఫాన్ కారణంగా నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘాల నేతల ఆధ్వర్యంలో ఒంగోలులోని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పొగాకు బోర్డు ఇన్‌ఛార్జి ఆర్ఎం డాక్టర్ ఎం.కృష్ణశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. ▶ మెయిన్‌లో

భూసేకరణ ప్రారంభించాలి

(మొదటిపేజీ తరువాయి)

రావడం లేదన్నారు. వెంటనే పర్చూరు మండలానికి భూసేకరణ కోసం నోటిఫికేషన్ ఇవ్వాలని, సత్వరమే గుంటూరు చానల్ పొడిగింపు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ పర్చూరు మండలానికి భూసేకరణ పనులు వెంటనే చేపట్టేలా ప్రభుత్వానికి తెలియపరుస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి జి.గంగయ్య, గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఎం జిల్లా నాయకులు కామమాని నాగేశ్వరరావు, దొప్పలపూడి రమేష్ బాబు, నల్లమడ రైతుసంఘం నాయకులు నరిశెట్టి ఆచారి, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు బండి శంకరయ్య, తల్లపనేని రామారావు, బండి శంకరయ్య, కొత్త వెంకటశివరావు, చుక్క యానాదులు, దేవరపల్లి సర్పంచ్ తోకల కృష్ణమోహన్, రైతు నాయకులు గోరంట్ల భాస్కరరావు, వంకాయలపాటి వీరయ్య, నెల్లూరు రామారావు, నర్రా శ్రీనివాసరావు, గోరంట్ల రామకృష్ణ, ఆళ్ల వెంకట్రావు, మిన్నెకంటి శివ, అడ్డగడ శ్రీనివాసరావు, దండా శ్రీనివాసరావు, పర్వతనేని బాపూజీ, లావు నాగేశ్వరరావు, ఎస్. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికులు, ఉద్యోగులతో పెట్టుకుంటే ఖబడ్దార్

(మొదటిపేజీ తరువాయి)

ప్రైవేటుపరం చేస్తున్నా.. ప్రభుత్వ సంస్థల్ని అదానీ, అంబానీలకు అప్పనంగా అప్పగిస్తున్నా.. వీళ్లు ముగ్గురూ కళ్లప్పగించి చూస్తున్నారు తప్ప వ్యతిరేకించే ధైర్యం చేయడం లేదని విమర్శించారు. విశాఖ ఉక్కు కాపాడుకోవడానికి సిఐటియు విశాఖలో 700 రోజులుగా పోరాడుతోందన్నారు. విశాఖ ఉక్కు కోసం 1967లో 65 మంది సిపిఎం ఎమ్మెల్యేలు రాజీనామా చేశారని, ఇప్పుడు రాజీనామా చేయడానికి ఇప్పటి ఎమ్మెల్యేలకు దమ్ముందా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవర్గంపై ముప్పేట దాడి చేస్తోందన్నారు. ఫేషియల్ అటెండెన్స్ ఉపాధ్యాయులకు కాదు ముందు ముఖ్యమంత్రి జగన్‌కు పెట్టాలన్నారు. ఎవరూ ఓట్లను అమ్ముకోవద్దన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలను ఎదుర్కొనే దమ్ము ఎర్రజెండాకు మాత్రమే ఉందన్నారు. సిఎం కుర్చీ కోసమే మూడు పార్టీల వాళ్లు కొట్టుకుంటున్నారు తప్ప.. ప్రజలకు మేలు చేయాలనే ధ్యాస వాళ్లకు లేదని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పేద, దళిత వర్గాల ఐక్య పోరాటాల ద్వారానే ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సభకు ఎం.రమేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రమేష్, చీకటి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు కాలం సుబ్బారావు, జి.శ్రీనివాసులు, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఎస్‌డి.హనీఫ్, గ్రానైట్ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.వీరాంజనేయులు, అంగనవాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి టి.కల్పన, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అయ్యపురెడ్డి, మెడికల్ హెల్త్ యూనియన్ జిల్లా నాయకులు టి.వెంకటేశ్వర్లు, సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, జిల్లా నాయకులు పూసపాటి వెంకటరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో సమావేశం

ప్రజాశక్తి-ముండ్లమూరు

ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధనను అందించాలని డిఇఒ విజయభాస్కర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించి నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చంద్రమోహన్,వివిధ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

28న త్యాగరాజ స్వామి ఆరాధన

ప్రజాశక్తి-కనిగిరి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ

నాయీబ్రాహ్మణ సేవా సంఘం ,వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28న కనిగిరిలో త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నాయీబ్రాహ్మణ సేవా సంఘం పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు పతకమూరి రాంబాబు, రాజ మహేంద్రవు మురళి తెలిపారు. స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 28న ఉదయం 10 గంటలకు స్థానిక శివనగర్ కాలనీలోని సద్గురు దత్త పీఠం నుంచి స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలు, రాత్రి 10 గంటలకు నాదస్వర కచ్చేరిలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏపి, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ సంగీత కళాకారులు ఈ కచ్చేరిలో పాల్గొని సంగీతాలపనతో అలరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చెరుకూరి బాలరంగయ్య, చింతలపూడి తిరుపాలు, కనిగిరి మనోహర్, పచ్చవ చంద్రశేఖర్, గోపిశెట్టి బాల చెన్నారావు, ద్రోణాదుల మధుసూదన్‌రావు, గొబ్బూరి నారాయణ, ఉప్పలపాటి వెంకట నారాయణ, ఈదర శ్రీని వాసులు, గంగనపల్లి వెంకటేశ్వర్లు ,చలంచర్ల రాంబాబు, రాచర్ల వెంకటనారాయణ, భీమవరపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-టంగుటూరు

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా బుధవారం కందుకూరు నియోజకవర్గంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారని, ఆ పర్యటనను జయప్రదం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, పట్టణ కామని నాగశ్రీను తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబునాయుడుకు కొండపి నియోజకవర్గం తరపున ఘన స్వాగతం పలికేందుకు టిడిపి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు స్థానిక టోల్ ప్లాజా వద్ద నుంచి కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల తెలుగు యువత అధ్యక్షుడు అబ్బూరి అభిషేక్, టిడిపి రాష్ట్ర, నియోజకవర్గ ఎస్‌సి సెల్ కార్యదర్శులు ధర్నాసి బ్రహ్మానందం, కసుకుర్తి భాస్కర్, కామని శ్రీను, వెంకటస్వామి పాల్గొన్నారు. **కొండపి :** టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పర్యటనను జయప్రదం చేయాలని టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జి.రామయ్యచౌదరి, మండల అధ్యక్షుడు బి.యలమందనాయుడు కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఇదేమిఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా రోడ్డు నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గంలో బుధవారం పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడుకు ఘన స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దామా మురళి, టిడిపి యూత్ మండల అధ్యక్షుడు కాలేషా, రాఘవ,కిరణ్ పాల్గొన్నారు.

అర్చకుడు సుబ్బయ్య మృతి

సంతనూతలపాడు రూరల్ : సంతనూతలపాడు అంకాలమ్మ తల్లి దేవస్థానం అర్చకుడు ఉప్పుటూరి సుబ్బయ్య (79) వయోభారంతో మంగళవారం మృతిచెందాడు. సంతనూతలపాడు మండలం ఎండ్లూరు పంచాయతీ పరిధిలోని మన్నంవారిపాలెం గ్రామంలోని తన నివాసంలో సుబ్బయ్య మృతి చెందారు. సుబ్బయ్య మట్టి ఖర్చుల నిమిత్తం ఎండోమెంట్ ఇఒ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు రూ.5వేల నగదును ఆలయ ప్రతినిధి పోకూరి రవీంద్ర కుమార్ మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

మంత్రి సురేష్‌కు సిఎం జగన్ పరామర్శ

(మొదటిపేజీ తరువాయి)

మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్‌పి మల్లికగర్గ్, జాయింట్ కలెక్టర్ ఎం అభిషిక్త్ కిషోర్, అడిషనల్ ఎస్‌పి నాగేశ్వరరావు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాదవ ఉద్యోగుల సంఘం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పిచ్చయ్యయాదవ్

ప్రజాశక్తి - గిద్దలూరు

డాక్టర్ పిచ్చయ్యను సన్మానిస్తున్న నాయకులు

యాదవ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్ ఎన్నికయ్యారు. అందులో భాగంగా పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో డాక్టర్ పిచ్చయ్యను పలువురు యాదవ సోదరులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ డాక్టర్ పిచ్చయ్య ఉపాధ్యాయుడుగానే కాకా యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షుడిగా కొనసాగుతూ అనేక మంది పేద చిన్నారుల విద్యకోసం తన వంతు సాయం అందిస్తున్నారని కొనియాడారు. యాదవ అభివృద్ధికి మరింత చేయూత నందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య యాదవ్, మాజీ ఎంపిపి వెంకట రాజు, బైలడుగు బాలయ్య, చల్ల రమేష్ ,గోపాలకృష్ణ, ఆవులరాజు, వేణుగోపాల స్వామి దేవస్థాన చైర్మన్ వెంకటయ్య, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమోహన్ జన్మదిన వేడుకలు

పొదిలి : మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణ మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసుల రెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, నగర పంచాయతీ అధ్యక్షురాలు నూర్జహాన్ బేగం, నాయకులు గుజ్జుల రమణారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, జి.శ్రీను, జూపల్లి ఏడుకొండలు, మండల మాజీ కోఆప్షన్ మెంబర్ మస్తాన్ వలి, పులగొర్ల శ్రీనివాసులు, కంకణాల రమేష్, గూడూరి వినోద్ కుమార్, రాములవీడు శ్రీను, పేరం కోదండ రామిరెడ్డి, ఆర్‌ఎంపి వైద్యుడు యర్రం వెంకట రెడ్డి, రాములేటి మస్తాన్, శ్రీనివాస రెడ్డి, చిన నరసింహాలు, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బమ్మకు రాంబాబు నివాళి

ప్రజాశక్తి-పామూరు

మండల పరిధిలోని వగ్గంపల్లి గ్రామానికి రెక్కల వెంకటేశ్వర్‌రెడ్డి తల్లి రెక్కల సుబ్బమ్మ (70) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఆమె మృతదేహాన్ని మాజీ వైస్‌ఎంపిపి పువ్వాడి రాంబాబు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బమ్మకు నివాళులర్పించిన వారిలో గట్లా విజయ భాస్కరరెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, వగ్గంపల్లి సర్పంచి దేవరబోయిన సుబ్బయ్య, రామసుబ్బారెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, అచ్చయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

దావాసమను
మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS : 236/2022

Between-
సూర మమత @ సూర వెంకటమమత ...వాది
మరియు
మువ్వల సుబ్రహ్మణ్యం ...ప్రతివాది
To
మువ్వల సుబ్రహ్మణ్యం
S/o లేటు ఆంజనేయులు
డోర్ నెం. 12-31,పర్చూరు, బాపట్ల జిల్లా.

పై నంబరు గల దావాను మీపై దాఖలు చేసి మీకు ఎన్ని మార్లు దావా సమన్లు పంపినను చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 02-01-2023 న ఉ.10-30 ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గానీ వకీలు గారిద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేనియెడల మీ పరోక్షము నందు విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది: 02-01-2023.

రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH శ్రీరమణి
న్యాయవాదులు, పర్చూరు.

IN THE COURT OF THE JUDGE SENIOR CIVIL JUDGE AT CHIRALA
O.S.No.158/2013

Between
Kommanaboyina Pandu alias Gangaiah ...Plaintiff
and
Yarrakula Siva Kumari and others ...Defendants

To
Defendant No.2
Yarrakula Sivaiah, S/o.Not Known, R/o.24-2-3, Ganjipalem, Chirala, Chirala DMC.

SUMMONS

WHERE AS the above named plaintiff has made a suit to this Court. You are hereby required to appear in this court in-person or by a pleader duly instructed on the 29th day of December, 2022 at 10-30 AM to show cause of against the suit, failing which the said suit will be heard and determined exparty.

(By Court Order)
BOYINA RAMESH BABU
ADVOCATE FOR PETITIONER
CHIRALA

IN THE COURT OF THE JUDGE SENIOR CIVIL JUDGE AT CHIRALA
O.S.No.3/2014

Between
Kommanaboyina Pandu alias Gangaiah ...Plaintiff
and
Yarrakula Siva Kumari and others ...Defendants

To
Defendant No.2
Yarrakula Sivaiah, S/o.Not Known, R/o.24-2-3, Ganjipalem, Chirala, Chirala DMC.

SUMMONS

WHERE AS the above named plaintiff has made a suit to this Court. You are hereby required to appear in this court in-person or by a pleader duly instructed on the 29th day of December, 2022 at 10-30 AM to show cause of against the suit, failing which the said suit will be heard and determined exparty.

(By Court Order)
BOYINA RAMESH BABU
ADVOCATE FOR PETITIONER
CHIRALA

గాయపడిన ముఠా కూలీలను ఆదుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ ● క్షతగాత్రులను పరామర్శించిన నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పచ్చి పొగాకు ముఠా కూలీలు సీజన్లో అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం రక్షణ చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చీమకుర్తిలో పచ్చి పొగాకు ముఠా కూలీల ఆటో ప్రమాదానికి గురై అయిదుగురు తీవ్ర గాయాలతో ఒంగోలులోని రిమ్స్‌లో చేరారు. విషయం తెలిసిన వెంటనే వ్యవసాయ కార్మిక సంఘం బృందం బాధితుల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సంతనూతలపాడు గ్రామం నుంచి పొదిలి మండలం ఆముదాలపల్లి గ్రామానికి పచ్చాకుకొట్టి అల్లి పెట్టేందుకు ఆటోలో బయలుదేరి వెళుతుండగా చీమకుర్తి పట్టణంలో వరిగడ్డితో కూడిన ట్రాక్టర్ కూలీల ఆటోను ఢీ కొట్టిందని తెలిపారు. ఆటోలో మొత్తం తొమ్మిది మంది ఉండగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, నలుగురికి ప్రాథమిక వైద్యం చేసి పంపించారన్నారు. ఒంగోలులోని రిమ్స్‌లో ఐదుగురిలో నలుగురికి కాళ్లు చేతులు, వివిధ భాగాలు విరిగాయని,

క్షతగాత్రులను పరామర్శిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఒకరికి తలకి బలమైన గాయం తగిలిందని తెలిపారు. తీవ్రమైన గాయాలకు గురైన వారిలో మార్పుడి కోటేశ్వరరావు, మార్పుడి అంజమ్మ, కసుకుర్తి ఆదినారాయణ, కందుల శ్రీనివాసులు, కందుల ఆదిలక్ష్మి వున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జిల్లాలో ఈ సీజన్‌లో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని, అనేకమంది ట్రాక్టర్లపై నుంచి పడి, ఆటోలో నుంచి పడి ముఠా కూలీలు ప్రాణాలు కోల్పోవడం, అంగవైకల్యం కలుగుతుందన్నారు. ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు పనిచేయించుకునే రైతులు మానవతా దృక్పథంతో సహాయం చేయడం తప్ప, వ్యవసాయ పనుల్లో నిత్యం కష్టం చేస్తున్న ఈ కూలీలకు ప్రభుత్వం నుంచి చట్టప్రకారం ఎటువంటి సహాయం అందట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 142 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి అవుతుండగా ప్రకాశం జిల్లాలోనే 100 మిలియన్ కేజీలపైగా పొగాకు ఉత్పత్తి అయ్యి విదేశాలకు ఎగుమతి అవుతుందన్నారు. ఫలితంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పదివేల కోట్ల రూపాయల పైగా వివిధ రూపాల్లో ఆదాయం వస్తుందని వారు తెలిపారు. ఈ ఆదాయానికి మూలం ఈ కష్టజీవుల శ్రమేనని వారు తెలిపారు. ఆ ఆదాయంలో నుంచి వీరి రక్షణ కోసం కొద్దిమొత్తం కేటాయించమన్నా ప్రభుత్వాలు స్పందించటం లేదని, కూలీల పట్ల ప్రభుత్వాలు నిర్దయగా ఉన్నాయని వారు అన్నారు. కూలీల రక్షణ కోసం చట్టం చేయాలని, ప్రమాదానికి గురైన వీరందరికీ ప్రభుత్వం అన్ని విధాలా వైద్య సహాయం అందించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం సంతనూతలపాడు మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు కూడా బాధితులను పరామర్శించారు.

జగనన్న కాలనీని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని ముప్పవరం జగనన్న లేఅవుట్‌ను మంగళవారం సాయంత్రం కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. కాలనీలో త్వరగా ఇళ్ల నిర్మాణం చేస్తున్న దాన్ని చూసిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. లేఔట్‌లో మిగిలి ఉన్న కొద్దిపాటి స్థలాల్లో కూడా వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ ప్రాంతంలో అన్ని లేఔట్లకన్నా ముప్పవరం లేఅవుట్ త్వరగా అభివృద్ధి చెందిందని, ఇల్లు కూడా బాగా కట్టుకున్నారని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఇల్లు నిర్మించుకునేందుకు ఏవైనా సమస్యలు ఉంటే, వాటిని అధికారులు తక్షణమే పరిష్కరించాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే 1,80,000 కాకుండా, బ్యాంకు ద్వారా ఇచ్చే 35 వేల రూపాయలకు కూడా ప్రతి లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు ఎప్పటికప్పుడు కాలనీలను పరిశీలించాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఈనెల 29వ తేదీన ట్రయల్ రన్‌గా జాతీయ రహదారిపై విమానాలు దిగనున్న దృష్ట్యా రేణింగవరం వద్ద జాతీయ రహదారిని, రన్‌వేను పరిశీలించి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మండల స్థాయి అధికారులతో పాటు, జాతీయ రహదారి పర్యవేక్షణ అధికారులు కూడా పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవాటు చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

విద్యార్థులకు శాస్త్రీయ దక్పథం అలవాటు చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి మురళీధర్ అన్నారు. మంగళవారం బాపట్ల మండలం బేతపూడి సాల్వేషన్ ఆర్మీ పాఠశాలలో ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలను విడనాడాలన్నారు. అనంతరం దేశభక్తి గీతాలాపన జరిగింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు, కోట వెంకటేశ్వరరెడ్డి, పృధ్వీరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-భట్టిప్రోలు: క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని భట్టిప్రోలు గ్రామ ఉప సర్పంచ్ బుర్లే రాంప్రసాద్ పేద విద్యార్థులకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక ఆర్‌సిఎం చర్చిలో మంగళవారం వీటిని చర్చ్ పోస్టర్స్ ఆధ్వర్యంలో అందజేశారు. రాంప్రసాద్ తన వ్యక్తిగత సహాయంగా పేద విద్యార్థులకు అందించటం అభినందనీయమని పాస్టర్లు కొనియాడారు.

చిన్నారులకు దుప్పట్లు అందజేస్తున్న రాంప్రసాద్

క్షేత్ర సందర్శనకు 'ఆదర్శ' విద్యార్థులు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

క్షేత్ర సందర్శనలో భాగంగా వేటపాలెంలోని పురాతన సారస్వత గ్రంథాలయాన్ని ఇంకొల్లు ఆదర్శ హైస్కూలు విద్యార్థులు సందర్శించారు. అక్కడ ఉన్న పురాతన పుస్తకాలు, వార్తాపత్రికల పత్రులు, గాంధీ వాడిన చేతికర్రను పరిశీలించారు. క్షేత్ర సందర్శనలో విద్యార్థులకు కొత్త విషయ పరిజ్ఞానం వస్తుందని కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ వివరించారు.

వేటపాలెం గ్రంథాలయాన్ని సందర్శించిన ఆదర్శ విద్యార్థులు

అనారోగ్యంతో ఆర్మీ హవల్దార్ మృతి

ఆర్మీ లాంఛనాలతో ద్వారకపాడులో అంత్యక్రియలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

దేశరక్షణ కోసం ఆర్మీలో హవాల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న యర్రా హరికృష్ణ(38) అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై మృతి చెందటంతో మంగళవారం అయన స్వగ్రామం మార్టూరు మండలంలోని ద్వారకపాడు గ్రామంలో ఆర్మీ అధికారుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్మీ అధికారి నాగేశ్వరరావు హవల్దార్ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గత పది సంవత్సరాలుగా ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న హరికృష్ణ ప్రస్తుతం ఢిల్లీ 406 గన్ మిసైల్ రెజిమెంట్‌లో హవాల్దార్‌గా పనిచేస్తున్నాడు. మెదడులోని రక్త నాళంలో ఏర్పడిన గడ్డ కారణంగా అనారోగ్యానికి గురైన హరికృష్ణకు గత వారం అధికారులు ఢిల్లీ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించారు. గత నాలుగు రోజులుగా కోమాలో ఉన్న హరికృష్ణ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందారు. దీంతో ఆర్మీ అధికారి నాగేశ్వరరావు, తోటి హవల్దార్లు హరికృష్ణ మృతదేహాన్ని మంగళవారం ఉదయం చీరాలకు చెందిన ఎన్‌సిసి అధికారులతో కలిసి ఆయన స్వగ్రామం ద్వారకపాడుకు తరలించారు. సమాచారం తెలుసుకున్న వలపర్ల, ద్వారకాపాడు, సమీప గ్రామ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి హరికృష్ణ మృతదేహానికి నివాళులర్పించారు. హరికృష్ణ భార్య కుసుమ, కుమార్తె జాహ్నవి విలపించిన తీరు స్థానికులను కలచివేసింది. మిలిటరీ అధికారులు హరికృష్ణ శవపేటికపై జాతీయ జెండాను ఉంచి భార్య కుమార్తెలకు అందజేశారు. అనంతరం అధికారులు, గ్రామస్తులు అశ్రు నయనాలతో హరికృష్ణ అంత్యక్రియలు గ్రామంలోని శ్మశానవాటికలో నిర్వహించారు.

జవాను మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు, ఆర్మీ అధికారులు (ఇన్‌సెట్‌లో) హరికృష్ణ (ఫైల్)

ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

టిప్పర్లు ఢీకొని డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక పశ్చిమ బైపాస్ రోడ్డుపై రెండు టిప్పర్లు ఢీకొన్న సంఘటనలో డ్రైవర్ చాకలి మధు(30) మృతి చెందాడు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో చీమకుర్తి వైపు నుంచి రామాయపట్నం ఓడరేవుకు రాళ్లతో భారీ డంపర్ బయలుదేరింది. స్థానిక పశ్చిమ బైపాస్‌లో కెవి పాలెం జంక్షన్ మధ్యకు వెళ్లేసరికి మరో ఖాళీ టిప్పర్ వస్తూ వేగంగా ఎదురుగా వస్తున్న లోడు టిప్పరును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఖాళీ టిప్పర్ డ్రైవర్ చాకలి మధు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో కెవిపాలెంకు చెందిన రాచకొండ కొండయ్యకు తీవ్రగాయాలయ్యాయి. మృతుడు నంద్యాల జిల్లా పాములపాడు మండలం రుద్రవరం గ్రామానికి చెందినవాడు. స్థానిక ఎస్ఐ వి ఆంజనేయులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నటుడు నరసింగ ప్రసాద్ మృతి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఐదు దశాబ్దాల పైబడి తెలుగు నాటకరంగాన ఎనలేని సేవలు అందించిన నటుడు నర్సింగ్ ప్రసాద్ మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. బాపట్ల భీమావారి పాలెంకు చెందిన కోటేశ్వరరావు, వెంకాయమ్మ దంపతులకు10 మార్చి 1955న జన్మించిన నర్సింగ్ ప్రసాద్ తన 18వ యేట 1973లో నల్లూరి రామ్మోహనరావు దర్శకత్వాన అడ్రస్ లేని మనుషులు నాటికలో కాంట్రాక్టర్ పాత్రలో రంగప్రవేశం చేశారు. ఆపైన సుప్రసిద్ధ రంగస్థల నట ప్రయోక్త కెఎస్‌టి శాయి గురుత్వాన ఫైన్ ఆర్ట్స్ థియేటర్ ప్రదర్శించిన సర్పజాతి, కావమ్మ మొగుడు, క్షంతవ్యులు, రూల్స్ ఒప్పుకోవు అనే నాటికల్లో, నీలినీడలు అనే నాటకంలో కథానాయక పాత్రలు ధరించి ఉత్తమ శ్రేణి నటునిగా తెలుగునాట విఖ్యాతి గడించారు. నరసింగ్ ప్రసాద్‌గా జన బాహుళ్యాన పేరొందిన నరసింగం రాఘవ శివ ప్రసాదరావు మృతి తెలుగు నాటక రంగానికి తీరని లోటు అని రంగస్థల కళాకారులు కెఎస్‌టి శాయి, కోన గోవింద రావు, మన్నె శ్రీనివాసరావు, పోలూరు సుబ్బారావు, అమరనేని హరిబాబు, పులుగు చిన వీర రాఘవులు, బందా బాబు, గుళ్లపల్లి మల్లికార్జునరావు, రావూరి నరసింహవర్మ, ఆదాం షఫి ప్రభృతులు నివాళి అర్పించారు.

దుస్తులతో పాఠశాల విద్యార్థులు

క్రీడా దుస్తులు అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు

స్థానిక తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, సాఫ్ట్‌బాల్, వాలీబాల్ రాష్ట్ర క్రీడాకారుడు, ఆర్మీ హావల్దార్ యార్లగడ్డ కామేశ్వరరావు మంగళవారం పాఠశాల క్రీడా విద్యార్థులకు దుస్తులు అందజేశారు. క్రీడా పోటీలలో ప్రతిభను కనబర్చి పాఠశాలకు గుర్తింపును తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. చండీఘర్‌లో హవల్దార్‌గా పనిచేస్తున్న ఆయన పలు సూచనలు అందించారు. దుస్తులతో పాటు క్రీడా పరికరాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి మల్లికార్జునరావు, హెచ్‌ఎం రామకోటేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు ఉన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పేదల పక్కా గృహాల నిర్మాణాలలో పురోగతి కనిపించేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె విజయకృష్ణన్ ఆదేశించారు. నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ ఛాంబర్లో మంగళవారం సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీలలోని గృహ నిర్మాణాలు ఒక దశ నుంచి మరో దశకు చేరాలని కలెక్టర్ తెలిపారు. పేదలకు ప్రభుత్వమే ఇంటి స్థలాలు ఇస్తుందని పేర్కొన్నారు. పక్కా గృహాల నిర్మాణాలకు నిధులు, అదనంగా రుణాలు, ఇసుక, సిమెంటు, నీరు వంటి తదితర వనరులు సమకూర్చినప్పటికీ పురోగతి కనిపించక పోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా, లబ్ధిదారులను చైతన్య పరచకుండా నిద్రపోతున్నారా అంటూ నిలదీశారు. ప్రణాళిక లేకుండా అధికారులు పనిచేయడంతోనే ఎలాంటి పురోగతి కనిపించడం లేదని అన్నారు. జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నప్పటికీ గృహ నిర్మాణాలు జరగకపోవడంపై ఆరా తీశారు. అధికారులు ఆత్మగౌరవంతో పనిచేయాలని సూచించారు. గడిచిన రెండు వారాలుగా గృహ నిర్మాణాలు, గ్రామీణ్ పథకం పురోగతి లేకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలు కనీసం 50 శాతం చేరుకోకపోవడం, లబ్ధిదారులకు గృహ రుణాలు మంజూరు చేయకపోవడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. గ్రామీణ్ పథకం కింద రిజిస్ట్రేషన్ పూర్తిచేసిన 14 వేల గృహాలను జియో ట్యాగింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పునాది కంటే దిగువన ఉన్న గృహాలను రెండు వారాల్లో పునాది స్థాయికి చేరుకోవాలన్నారు. పునాది స్థాయిలోని గృహాలు లెంటిల్ దశకు, లెంటిల్ స్థాయిలోని గృహాలు, శ్లాబ్ దశకు, శ్లాబ్ వేసిన గృహాలు పూర్తి దశకు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రేపల్లె నియోజకవర్గంలో 1,696, అద్దంకి నియోజక వర్గంలో 1,136 గృహాలు పునాది దిగువన ఉండడంపై ఆరా తీశారు. ప్రతి రోజూ లక్ష్యాలు నిర్దేశించుకొని లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రభుత్వం ప్రాధాన్యతగా భావిస్తూ పట్టణాలు, గ్రామాలలో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సచివాలయాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, బిఎంసియు భవనాలు గడువులోగా నిర్మించడానికి ప్రణాళికతో పని చేయాలని కలెక్టర్ పలుసూచనలు చేశారు. నిర్మాణాలలో నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించాలని, ఈ భవనాలు గ్రామాలకు స్థిరాస్థిగా ఉంటాయని అన్నారు. ప్రజా ప్రయోజనం కోసం నిర్మిస్తున్న భవనాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పిడి బి అర్జునరావు, పిఆర్ ఎస్ఇ శ్రీనివాసులు, పిఆర్ గృహ నిర్మాణ శాఖ డిఇలు, డిఆర్‌డిఎ, మెప్మా ఏరియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పురోగతిపై శాఖల అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్

జాతీయ స్థాయి పరీక్షల్లో ర్యాంకు

ప్రజాశక్తి-అద్దంకి

కష్టపడి ఇష్టంతో చదవడం వలన కామన్ లా అడ్మిషన్ టెస్టు (క్లాటు)-2023 జాతీయ స్థాయి పరీక్షలలో పట్టణానికి చెందిన అనపర్తి స్నేహిత న్యాన్సీ 1053వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులు రమేష్ దంపతులు మాట్లాడుతూ చిన్నతనం నుంచి క్రమశిక్షణతో, ఉన్నత విలువలతో సమాజం పట్ల అవగాహన పెంచుతూ మంచి శిక్షణతో పెరిగిందని, అందువల్లనే జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించడం సాధ్యమైందని పేర్కొన్నారు. తామిద్దరం ఉపాధ్యాయ వృత్తులను చేపట్టామని, ఇష్టంతో విద్యార్థులకు చక్కటి విద్యను బోధిస్తున్నామని అన్నారు. తమ కుమార్తె ఈ ర్యాంకు సాధించడంలో కళాశాల యాజమాన్యం సహకారం ఉందని తెలిపారు. ర్యాంకు సాధించడంలో అధ్యాపకుల కృషి మరువలేనిదని అన్నారు. పలువురు ఉపాధ్యాయులు, బంధువులు విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

స్నేహిత న్యాన్సీ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి మోపిదేవి రమణ

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నగరం: నగరంలో ప్రజాశక్తి-2023 క్యాలెండర్‌ను రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి తనయుడు మోపిదేవి రాజీవ్, నగరం ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య, పెద్దపల్లి గొల్లపాలెం పిఎసిఎస్ చైర్మన్ బి వెంకట్రామయ్య, జడ్పీటీసీ నాగమణి, గ్రామ పంచాయితీ సర్పంచ్, పి వెంకటేశ్వరరావు, జాఫర్, ఇతర మండల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తాళ్లూరు ప్రదీప్

యుహెచ్ఆర్‌పిసి స్టేట్ కన్వీనర్‌గా ప్రదీప్

ప్రజాశక్తి-చీరాల: సమాజానికి చేయూత యుహెచ్ఆర్‌సి బాధ్యత అనే నినాదంతో మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్‌గా చీరాల వాసి తాళ్లూరు ప్రదీప్‌ను నియమిస్తున్నట్లు ఆ సమితి జాతీయ డైరెక్టర్ కంచర్ల జానుబాబు తెలిపారు. మంగళవారం విజయవాడలో రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తాళ్లూరి ప్రదీప్ మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘనకు ఎవరు పాల్పడినా వారిపై చట్ట ప్రకారంగా చర్యలు చేపడతామని అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ బాధితులకు అండగా నిలబడి వారి పక్షాన న్యాయం జరిగేంతవరకు యుహెచ్ఆర్‌పిసి అన్నివేళలా కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. హక్కుల కోసం పోరాడమే కాకుండా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వారికి తోడుగా నిలబడుతున్నామని అన్నారు. ఈపురిపాలెం స్ట్రెయిట్ కట్ట కాలువపైన నివాసముంటున్న ఎస్టీ కాలనీవాసులకు తాగునీటి బోరింగును ఏర్పాటు చేసి వారి దాహాన్ని తీర్చామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ప్రెసిడెంట్ అవ్వారు తారక రామారావు, జనరల్ సెక్రెటరీ లక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ కొమ్మన సుబ్బారావు తదితరులు హాజయ్యారు.

నేడు విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-సంతమాగులూరు: నేడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గం వైసీపీ కన్వీనర్ బాచిన కృష్ణ చైతన్య, విద్యార్థులకు ట్యాబ్స్‌ను అందజేస్తారని ఎంపీడీవో ఎం సాంబశివరావు, మండల విద్యాశాఖాధికారి వేమవరపు కోటేశ్వరరావు తెలిపారు. 644 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు, 72 మంది ఉపాధ్యాయులకు ఈ ట్యాబ్స్‌ను అందజేస్తారని ఎంఈఓ తెలిపారు.

సిబ్బంది పర్యవేక్షణ మరింత పెంచాలి: ఎస్‌పి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ వార్షిక తనిఖీలో భాగంగా ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం తనిఖీ నిర్వహించారు. ముందుగా ఎస్పీ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. గ్రామ సచివాలయ మహిళా పోలీసులు, పోలీసు సిబ్బందితో సమావేశమై వారు చేస్తున్న విధుల గురించి, 'మహిళా పోలీస్ డ్యూటీ ట్రాకర్' వెబ్ సైట్‌లో వారి రోజువారి విధుల వివరాలను పొందుపరుస్తున్నారా? లేదా?, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి నేరాలు జరుగుతున్నాయి? రౌడీలు, సస్పెక్ట్‌లు, పాత నేరస్తులు ఎవరు ఉన్నారు? వారి కదలికల గురించిన వివరాలను, స్థల వివాదాలు, కుటుంబ తగాదాలు, వర్గ విభేదాలు గురించిన సమాచారాన్ని, గతంలో ఎటువంటి నేరాలు జరిగినాయి? అందులో ముద్దాయిలు ఎవరు? బాధితులు ఎవరు? వారి ప్రస్తుత జీవన విధానం వంటి విషయాల గురించి విపులంగా అడిగి తెలుసుకున్నారు. మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఒంటరి మహిళలను గుర్తించి తరచూ వారి ఇంటిని సందర్శిస్తూ ఉండాలని, సైబర్ నేరాల గురించి, లోన్ యాప్‌ల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. బీట్ వ్యవస్థను మరింత పటిష్టం చెయ్యాలని అన్నారు. రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించే పోలీస్ అధికారుల వాహనాలకు సైరన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. రాత్రి సమయాలలో గస్తీ పటిష్టంగా నిర్వహిస్తే నేరాలు నియంత్రించవచ్చునని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రదేశాలలో, రహదారులపై తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే వివిధ క్రైమ్ రికార్డులను, సిడి ఫైల్స్‌ను పరిశీలించారు. ఇంకొల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవించే ప్రదేశాల గురించి, ఆ ప్రదేశాలలో తీసుకోవలసిన ముందస్తు చర్యల గురించి సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. వార్షిక తనిఖీల్లో చీరాల సబ్ డివిజన్ ఎస్‌డిపిఓ పి శ్రీకాంత్, ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి సూర్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎ శ్రీనివాస్, సిసి హరికృష్ణ, ఇంకొల్లు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, ఇంకొల్లు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజలకు తపాలా శాఖ మెరుగైన సేవలు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

విస్తృత పరుస్తున్న తపాలా సేవలలో భాగంగా బాపట్ల హెడ్ పోస్టాఫీసులో కొత్త పాస్ పోర్ట్ జారీ, పాస్‌పోర్ట్ రెన్యువల్, ఆధార్ కార్డుల జారీ, నవీకరించుట మొదలైన సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్ తెలిపారు. వార్షిక తనిఖీ నిమిత్తం బాపట్ల హెడ్ పోస్ట్ ఆఫీస్ సందర్శించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బాపట్ల చుట్టుపక్కల ప్రాంత ప్రజల సౌకర్యార్థం పాస్ పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రతిరోజు 50 స్లాట్స్ వరకు బుక్ చేసుకునే సదుపాయం ఉన్నదని, దీనిని మరింత పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. అలాగే జనవరి ఒకటో తారీకు నుంచి బాపట్ల పాస్ పోర్ట్ సేవా కేంద్రం ఆన్‌లైన్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, పాస్‌పోర్ట్ జారీ తదితర ప్రక్రియలు అన్నీ త్వరితగతిన విశాఖపట్నం, విజయవాడ సేవా కేంద్రాలతో సమానంగా 10 రోజులలోపే జారీ చేస్తామని తెలిపారు. అలాగే కొత్త ఆధార్ కార్డుల నమోదు, నవీకరించడం మొదలైన సేవలన్నీ ప్రత్యేక కౌంటర్‌ను బాపట్ల హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోస్ట్ ఆఫీస్ పనివేళలలో ఎప్పుడైనా ఈ కౌంటర్ ద్వారా ఆధార్ సంబంధిత సేవలు పొందవచ్చునని తెలియపరిచారు.

తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ రమేష్

29న పి.గుడిపాడు వద్ద విమానాల ల్యాండింగ్

ప్రజాశక్తి-మేదరమెట్ల

ఈనెల 29వ తేదీన చెన్నై కొల్‌కతా జాతీయ రహదారిపై కొరిసపాడు మండలం పి గుడిపాడు గ్రామ ప్రాంతంలో యుద్ధ విమానాలు దిగనున్న ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ కె విజయకృష్ణన్ మంగళవారం పరిశీలించారు. అధికారులను అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. రేపు ఒక కార్గో, రెండు పైలట్ విమానాలు ఈ ప్రాంతంలో దిగనున్నాయి. ట్రయల్ రన్ సందర్భంగా ఇవి దిగేందుకు తగిన పరిస్థితులను గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జెసి శ్రీనివాసులు, భారత వైమానిక దళ గ్రూప్ కెప్టెన్ ఆర్ఎస్ చౌదరితో పాటు అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. అనంతరం మేదరమెట్లలో జగనన్న కాలనీని సందర్శించి అక్కడ లబ్ధిదారులతో మాట్లాడారు. సమస్యలను పరిష్కరించడానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ దశరథ శర్మ, గ్రామ సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, స్థానిక నాయకులు రత్నారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కోట ఝాన్సీరాణికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు నివాళి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

జనవిజ్ఞాన వేదిక సమతా సభ్యురాలు, కోట ఝాన్సీ రాణి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే మురళి ధర్, సిపిఎం గుంటూరు జిల్లా కన్వీనర్ పాశం రామారావు మంగళ వారం వెదుళ్లపల్లి గ్రామంలోని ఝాన్సీ రాణి స్వగృహంలో ఆమె చిత్రపటానికి నివాళు లర్పించారు. ఝాన్సీరాణి 35 సంవత్సరాల సుదీర్ఘ కాలం భర్త కోట వెంకటేశ్వరరెడ్డితో కలసి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయిలో ఎన్నో విజ్ఞాన చైతన్య కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. సాంస్కృతిక రంగంలో ఘంటసాల కళాకారులకు, కళా సంస్థలకు ఆర్గనైజర్‌గా వ్యవహరించారని గుర్తు చేశారు. కోట వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఝాన్సీరాణి పాల్గొని స్ఫూర్తి ఇచ్చారని పేర్కొన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ఆమె జీవితం పలువురికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు, పృధ్వీరాజ్ పాల్గొన్నారు.

కోట వెంకటేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న కేఎస్ లక్ష్మణరావు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

విద్యార్థినులకు అభినందనలు

ప్రజాశక్తి- సంతనూతలపాడు రూరల్

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సంతనూతలపాడు హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈనెల 23న దొనకొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక కోసం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు ఈ పోటీల్లో సీనియర్ల విభాగంలో సంతనూతలపాడు హైస్కూల్ విద్యార్థినులు టి.విజయలక్ష్మి, ఎ.మాధవి, పి.కుసుమ, షేక్ సందాని, ఆర్.అనూష, జూనియర్స్ విభాగంలో ఎం.అమూల్య, వి. హర్షిత, వి హాసిని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి నులను ప్రధానోపాధ్యాయుడు పి.రామారావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు కె. మల్లికరాణి, బి. శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

యర్రగొండపాలెంలో ఫ్లెక్సీల కలకలం

- బూదాల అజితారావు పేరుతో పెద్దఎత్తున ఏర్పాటు
- అయోమయంలో తెలుగు తమ్ముళ్లు

అజితారావు పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలో కొత్త సంవత్సరానికి ముందే ఫ్లెక్సీలు కలకలం కలిగిస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారి, నియోజకవర్గంలోని ఐదు మండలాలలో బూదాల అజితారావు పేరుతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల వ్యవహారం ప్రతిపక్ష పార్టీల్లో చర్చలకు దారి తీస్తోంది. గతంలో బూదాల అజితారావు టిడిపి అభ్యర్థిగా యర్రగొండపాలెం నుంచి రెండుసార్లు పోటీ చేసి ఓటమి చెందారు. బలమైన సామాజిక వర్గం పూర్తి స్థాయిలో బంధుత్వాలు ఉన్నా ఆమె ఓడిపోయారు. అయినప్పటికీ ఆమె నియోజకవర్గంలోని ఐదు మండలాల ద్వితీయ శ్రేణి నాయకులతో గ్రూపును పదిలం చేసుకున్నారు. ఎలాగైనా యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచే గెలవాలని ఆమె సన్నద్ధం అవుతున్నారు.ఆమె స్థానికంగా ఉండకుండా ఎన్నికల సమయంలో, కొత్త సంవత్సర వేడుకల్లోనే కనిపిస్తుండడంతో ఆమె వర్గానికి సైతం కొంత ఇబ్బందికరంగా ఉంది. ప్రస్తుతం గూడూరి ఎరిక్షన్‌బాబు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టిడిపిలోని అన్ని వర్గాలు కలిసి పని చేయకపోవడంతో ఆయనకు తలనొప్పిగా మారింది. టిడిపిలోని కీలకనేత ఫొటోలతో అజితారావు ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నారు. దీంతో టిడిపి అభ్యర్థి ఎవరనే అనుమానాలు కార్యకర్తల్లో కలుగుతున్నాయి. గూడూరి ఎరిక్షన్‌బాబు అందర్ని కలుపుకొని పోవడం లేదని కార్యకర్తలు బహిరంగంగానే చెబుతున్నారు. నియోజకవర్గం లోని దోర్నాల, త్రిపురాంతకం మండలాల్లోనే ఎరిక్షన్‌బాబు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండ పాలెంలో కార్యక్రమాలు నిర్వహించడం లేదని కార్యకర్తలు పేర్కొంటున్నారు. బూదాల అజితారావు పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, ఆ ఫ్లెక్సీల్లో సీనియర్ నాయకుడు డాక్టర్ మన్నె రవీంద్ర ఫోటో ఉండడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టిడిపి అధిష్టానం నియోజక్‌వర్గంలో జోక్యం చేసుకొని వర్గపోరును నివారించకుంటే తిరిగి ఓటమి తప్పదని తెలుగు తమ్ముళ్లు మదన పడుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- దొనకొండ

ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి

మండల పరిధిలోని చందవరం రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపిపి ఉషామురళీ మంగళ వారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వజ్రగిరి రాణి, సొసైటీ అధ్యక్షుడు కన్నెధార వెంకటసుబ్బయ్య, జడ్‌పిటిసి సుధాకర్, ఎంపిటిసి బండారు రాజు, పంచాయతీ కార్యదర్శి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

స్టడీమెటీరియల్ అందజేస్తున్న బూచేపల్లి, ఎమ్మెల్యే

చీమకుర్తి : బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 10 తరగతి విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబు చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి ఆశయాలకు అణుగుణంగా ప్రతి ఏడాది 10 తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి, జవహర్,శేఖరరెడ్డి, ప్రిన్సిపల్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాకీ కిట్ అందజేస్తున్న ఎంపిటిసి

హాకీ కిట్ అందజేత

ప్రజాశక్తి- సంతనూతలపాడు రూరల్

విశాఖపట్నంలో ఈనెల 28,29, 30 తేదీల్లో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో మండల పరిధిలోని ఎండ్లూరు గ్రామానికి కె.బాలాజీ పాల్గొనున్నాడు. అందులో భాగంగా బాలాజీకి ఎండ్లూరు గ్రామ ఎంపిపిసి కె. వెంకటేశ్వరరావు మంగళవారం హాకీ కిట్ అంద జేశారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మయ్య, పిఇటి రవికుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యనందించేందుకే ట్యాబ్‌లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బేస్తవారి పేట

విద్యార్థులకు సాంకేంతిక విద్యనందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ట్యాంబ్‌లు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు మంగళవారం ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులకు మెరుగైన విద్యన అందించడం కోసం బైజుస్ ద్వారా సాంకేతిక విద్యా విధానాలతో ట్యాబ్‌లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వేగినాటి ఓసూరా రెడ్డి, జడ్‌పిటిసి వెంకట్ రాజు, ఎంపిడిఒ కేశవరెడ్డి, ఉప సర్పంచి మట్టా రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ, ఎంఇఒ జింక వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **చీమకుర్తి :** నాడు- నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తశకం ఆరంభమైందని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. స్థానిక ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఎంఇఒ రవి, జెవివి జిల్లా కార్యదర్శి డాక్టర్ జవహర్, వైసిపి పట్టణ అధ్యక్షుడు కె శేఖరరెడ్డి,కౌన్సిలర్లు పాల్గొన్నారు. **దర్శి :** కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకం ద్వారా అభివృద్ధి చేసినట్లు తాళ్ళూరు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డితెలిపారు. తాళ్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు ఎంఇఒ సుబ్బయ్య ఆధ్వర్యంలో ట్యాబ్‌లు పంపిణి చేశారు. అనంతరం తాళ్ళూరు రైతు భరోసా కేంద్రంలో ఎఒ ప్రసాద్ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ ద్వారా ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **శింగరాయకొండ :** పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు

ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

ట్యాబ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణమ్మ ఎంపిపి కట్టా శోభారాణి , పాకల సర్పంచి బి. ప్రభాకర్ రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ మాధవరావు ఎంపిటిసిలు శ్రీను, అంకయ్య, అశోక్, వైసిపి నాయకులు గోవర్ధన్, పున్నయ్య, తాతయ్య, కష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. **దొనకొండ:** స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాల, ఆర్‌సిఎం పాఠశాలలో 8వ తరగతి విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంపిపి ఉషామురళీ, ఎంఇఒ ఎన్.సాంబశివరావు చేతుల మీదుగా విద్యార్థినులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు, వై.ఆరోగ్యదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **జరుగుమల్లి :** నాణ్యమైన విద్యనందించాలనే సంకల్పంతో 8 వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ట్యబ్‌లు పంపిణీ చేస్తున్నటు ఎంపిపి బెల్లం నిర్మల సత్యన్నారాయణ తెలిపారు. జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు తమ విజ్ఞాన్ని పెంపొందించు కొని ఉన్నత చదువులు చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మాతంగి చంద్రలీల, ఎంపిడిఒ పి.రామకష్ణ, ఎంఇఒ బి.నాగేంద్ర వదన్, పాఠశాల ప్రధానోపధ్యాయుడు ఎం. శ్రీనివాసరావు, కెజిబివి ప్రత్యేక అధికారి ఎన్. స్రవంతి,సర్పంచి పున్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొదిలి : మండల పరిధిలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నట్లు ఎంఇఒ శ్రీనివాసులు తెలిపారు. మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి చేతుల మీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. **పెద్దదోర్నాల :** విద్యార్థులు ఇష్టంతో చదివి చదువుల్లో రాణించాలని ఎంపిపి గుమ్మా పద్మజ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థినులుట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి గుమ్మా పద్మజ, జడ్‌పిటిసి లతాబాయి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, విద్యా కమిటీ చైర్మన్ చిట్టి వెంకటేశ్వరరెడ్డి, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు నాగేంద్ర నాయక్, అబ్దుల్ సలాం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. **పిసిపల్లి :** స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో 8వతరగతి చదువుతున్న విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు ఎంఇఒ ఎ.ప్రసాదరావు తెలిపారు. పాఠశాలలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతలకు బహుమతులు ప్రశంస పత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్యాల జఘన్య, జడ్‌పిటిసి లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, ఎంపిడిఒ డివి.రమణారెడ్డి, ఎంపిటిసి కొడారెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, యుటిఎఫ్ నాయకులు యేసుబాబు, బివి.మాల్యాద్రి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ముండ్లమూరు :** మండల పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూళ్లలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థినులకు ఎంపిపి సుంకర సునీత చేతుల మీదుగా ట్యాబ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రత్నరాజు, హైస్కూల్ హెచ్‌ఎం సుజాత, ఈదర పాఠశాల హెచ్‌ఎం సుబ్బారావు, వైసిపి నాయకులు సుంకర బ్రహ్మానందరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దారవీడు విద్యార్థుల ప్రతిభ

పెద్దారవీడు : కడప జిల్లా బ్రహ్మంగారి మఠంలోని శ్రీశ్రీశ్రీ ఆచలానంద ఆశ్రమంలో ఈ నెల 25న సంభాగ్‌స్థాయి ఖేల్-ఖుద్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభను చూపినట్లు పెద్దారవీడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.రామచంద్రారెడ్డి తెలిపారు. 100 మీటర్ల పరుగు పందెం సీనియర్ విభాగంలో శివనాయక్ ప్రథమ స్థానం, జూనియర్ విభాగంలో డి.ఓంకార్ ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో శివనాయక్ ప్రథమ, ఓంకార్ ద్వితీయ స్థానం, హైజంప్ సీనియర్స్ విభాగంలో శివ నాయక్ ప్రథమ, జె.శివ ద్వితీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. జూనియర్ విభాగంలో వై.వంశీకృష్ణ ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు , తోటి విద్యార్థులు మంగళవారం అభినందించారు.

తీరం వెంబడి కోడి పందేలు

- మామూళ్ల మత్తులో పోలీసులు
- వైసిపి, టిడిపి నాయకుల కుమ్మక్కై జూదం నిర్వహణ

ప్రజాశక్తి -శింగరాయకొండ

సముద్ర తీరంలో కోడి పందేలు పెద్దఎతున్న నిర్వహిస్తున్నారు. నియంత్రించాల్సి పోలీసులు కంచె చేను మేస్తే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. నిర్వహకులు ముందుగానే పోలీసులకు సమాచారం ఇచ్చి వారి అండదండలతో పందేలు నిర్వహిస్తున్నారు.వైసిపి, టిడిపి నాయకులు కుమ్మక్కై కోడి పందెలు నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని పాకల, ఊళ్ల పాలెం, బింగినపల్లి కరేడు పెద్దపట్టపాలెం, టంగుటూరు మండలంలోని వెంకటాయపాలెం, పసుపు ముద్ర, కేశపాలెం ప్రాంతాల్లో సముద్ర తీరం వెంబడి పందేలు నిర్వహిస్తున్నారు. కోడిపందేలను నియంత్రంచాల్సిన పోలీసులు జూదరులకు ముందస్తు సమాచారం అందిస్తూ రోజువారి మామూళ్లల్లో మునిగిపోతున్నారు.ఇటీవల సిఐ దాచేపల్లి రంగనాథ్ పాకల మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. కోడి పందేలకు సహకరించద్దని వారి సూచించారు. సిఐ రంగనాథ్ సమావేశం నిర్వహించిన మరుసటి రోజే పాకల తీరంలో కోడిపందేలు నిర్వహించారు. పాకల, టంగుటూరు, శింగరాయకొండ మండలాల్లో సముద్ర తీరం వెంబడి రహస్య ప్రదేశాలను ఎంచుకొని కోడిపందేలు నిర్వహిస్తున్నారు. పందేలు నిర్వహించే చోట మద్యం కూడా ఏరులై పారుతోంది. కొందరు మద్యాన్ని అక్కడికి తీసుకెళ్లి అధిక ధరలకు అమ్మి తమ జేబులు నింపుకుంటున్నారు. జరుగుమల్లి, శింగరాయకొండ ,టంగుటూరు, కందుకూరు,ఉలవపాడు, ఒంగోలు ప్రాంతానికి చెందిన జూదరులు ఇక్కడకు వచ్చి పందేలు కాస్తున్నారు. కోడి పందేల గురించి పోలీసులకు సమాచారం అందినప్పటికీ వారు జూదరులకు సమాచారం అందిస్తున్నారు. జూదరులు అక్కడి నుంచి వెళ్లి పోయిన తర్వాత పోలీసులు తాపీగా వెళ్లి దాడులు నిర్వహించిన మమ అనిపిస్తున్నారు. జూదరుల నుంచి రోజు వారీ మాములు తీసుకొని కోడి పందేల గురించి పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతస్థాయి అధికారులు స్పందించి కోడిపందేల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సి అవసరముంది.

జూదం నిర్వహణ ప్రాంతంలో ఉన్న పందెపు పుంజు

కోడిపందెం వద్ద గుమిగూడిన జనం

ఎనలాగ్ సర్క్యూట్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-టంగుటూరు

విద్యార్థులు ఎనలాగ్ సర్క్యూట్స్ ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగి ఉండాలని పేస్ ఇంజినీరింగ్ కళాశాల రిసోర్స్ పర్సన్ పవన్‌కుమార్ తెలిపారు. స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ ఎనలాగ్ సర్క్యూట్స్ యొక్క విశిష్టత వాటి అప్లికేషన్స్ గురించి విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. అనంతరం విద్యార్థులను అడిగిన పలు సందేహాలను పవన్ కుమార్ నివత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపల్ మూర్తి, ఇసిఇ విభాగాధిపతి ఎం.రాజశేఖర్, కళాశాల అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండల పరిధిలోని దాసరిపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ కష్ణారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలోని సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బందికి సూచనలు. సలహాలు చేశారు.

29న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పొదిలి

మండల పరిధిలోని నందిపాలెం గ్రామంలో మాజీ సర్పంచి, దివంగత దోర్నాల వెంకట రెడ్డి వర్ధంతి సందర్భంగా 29న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వెంకటరెడ్డి కుమారుడు, న్యాయవాది కొండారెడ్డి తెలిపారు. ఎల్‌వి. ప్రసాద్ కంటి హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండల ప్రజలందరూ ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

నేడు వాలంటీర్లతో సమావేశం

పొదిలి : మండల పరిధిలోని వాలంటీర్లతో మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి బుధవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీకృష్ణ మంగళవారం ఓ ప్రకటన తెలిపారు. పొదిలి రథం రోడ్డులోని శ్రీ సాయిబాలాజీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న సమావేశానికి పొదిలి అర్బన్ మరియు రూరల్ పరిధిలోని వాలంటీరులందరూ హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

31లోపు ఇకెవైసి చేయించుకోవాలి

యర్రగొండపాలెం : పిఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందే రైతులందరూ ఈ నెలాఖరులోపు ఇకెవైసి చేయించుకోవాలని ఎఒ పెద్ద వెంకటేశ్వర్లు తెలిపారు. 13వ విడత పిఎం కిసాన్ సొమ్మును జనవరిలో రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు. రైతుల ఖాతాల్లో సొమ్ము జమ కావాలంటే తప్పనిపరిగా ఇకెవైసి చేయించుకోవాలని ఆయన తెలిపారు.

థెరిసమ్మ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ప్రాంతంలో ఉన్నత విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన డాక్టర్ ఆదిమూలపు శామ్యూల్ జార్జి సతీమణి చెరుకూరి థెరిసమ్మ మృతి పశ్చిమ ప్రకాశానికి తీరని లోటని సిపిఎం సీనియర్ నాయకుడు గాలి వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. థెరిసమ్మ మృతికి సంతాపం ప్రకటించారు. డాక్టర్ జార్జితో పాటు థెరిసమ్మ అనేక మంది పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దారని కొనియాడారు. థెరిసమ్మ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

పెద్దదోర్నాల : రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంటల వివరాలను ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని ఎఒ జవహర్‌లాల్ నాయక్ తెలిపారు. మండల పరిధిలోని యడవల్లి, కటకానిపల్లి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. అనంతరం పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ 2022-23 రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నట్లు ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెద్దనాగులవరం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రజల సమస్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ, మతం, కులం, ప్రాంతాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఓర్సు రమణయ్య, జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, ఎంపిపి పోరెడ్డి అరుణ, వైసిపి నాయకులు బొగ్గ రవిచెన్నారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గడపగడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రాజెక్టుల నిర్మాణంపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్, మిగతా రాష్ట్రాలలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, నిర్మాణంపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర రైల్వే, ప్రసార, ఎలక్ట్రానిక్స్ సాంకేతిక సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిస్తూ రైల్వే ప్రాజెక్టుల పరిధి పలు రాష్ట్రాల సరిహద్దులలో వెళుతుండటంతో రాష్ట్రాల వారీగా, రైల్వే జోనళ్ళ ప్రకారం నిర్మించబడుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ తో సహా అన్ని రాష్ట్రాలలో రూ.7.33 లక్షల కోట్ల ఖర్చుతో 49,323 కిలోమీటర్ల 183 కొత్త లైన్లు, 42 గేజి మార్పిడి లైన్లు, 227 డబుల్ లైన్లు పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. 2022 మార్చి నాటికి రూ. 2.35 లక్షల కోట్లతో 11,518 కిలోమీటర్ల లైన్లు అప్పగించామన్నారు. ఈ పనులకు 2022-23 బడ్జెట్‌లో రూ. 67,001 కోట్లు అందించామన్నారు. ఆంధ్రపదేశ్ కు సంబంధించి రూ. 70,594 కోట్లతో 5,581 కి.మీ. పొడవున 16 కొత్త లైన్లు, 15 డబుల్ లైన్లు నిర్మాణం 01-04-2022 నాటికీ వివిధ దశలలో ఉన్నాయన్నారు. 2022 మార్చి నాటికి రూ. 19,414 కోట్లతో 636 కిలోమీటర్ల లైన్లు అప్పగించామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాలు, భద్రత పనులకు 2014 నుండి వార్షిక బడ్జెట్లలో సరాసరి కన్నా అధిక శాతం కేటాయింపులు జరిగాయని మంత్రి తెలిపారు.

టిడిపి హయాంలోనే దళితవాడల అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

టిడిపి ప్రభుత్వ హయాంలోనే దళితవాడలు అభివృద్ధి చెందినట్లు మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. కొనకనమిట్ల మండలం గొట్లగట్టు పంచాయతీలోని నాయుడుపేట ఎస్‌సిపాలెంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని తెలిపారు. ఎస్‌సి,ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పెరిగే సుఖ్‌దేవ్, టిడిపి మండల కన్వీనర్ మోరబోయిన బాబూరావు, పొదిలి ఎఎంసి మాజీ చైర్మన్ చప్పిడి రామలింగయ్య, నాయకులు పి.సుబ్బయ్య, కోనంకి సాల్మన్, రత్నం, రోశయ్య, తిరుపతయ్య, బాలయ్య, దేవిరెడ్డి డేవిడ్ పాల్గొన్నారు.

ఇదేమి ఖర్మలో మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వ్యాసరచన పోటీలు

మార్కాపురం : స్వామి వివేకానంద ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వివేకానందుడి జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలను యోగ భారతి ట్రస్ట్ ఆధర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు చంద్ర శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సన్మార్గంలో నడుస్తూ మంచి అలవాట్లను అలవరచుకోవాలన్నారు. యువతీ యువకులు దేశానికి దిక్సూచిగా మారాలన్నారు. ఈ కార్యక్రమంలో తానుగుండ్ల వెంకటేశ్వరరెడ్డి, శ్రీధర సుబ్బారావుశర్మ, భాగ్యలక్ష్మి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి : జెవివి

ప్రజాశక్తి-మార్కాపురం

నిత్య జీవితంలో సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని జెవివి పట్టణ అధ్యక్షుడు చక్కిలం శ్రీధర్ తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక శ్రీవిద్య కోచింగ్ సెంటర్‌లో నిత్యజీవితంలో సైన్సు అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి కనబరుస్తూ, నిత్యజీవితంలో సైన్స్ బోధించే యధార్ధాన్ని పాటించాలన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు .వెంకట్రావు మాట్లాడుతూ ఆకాశంలోకి రాకెట్లను పంపే స్థాయిలో సైన్స్ అండ్ టెక్నాలజీ అభివద్ధి చెందిందన్నారు. ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక డివిజన్ కార్యదర్శి ఏనుగుల రవికుమార్, డివిజన్ అధ్యక్షుడు ఎస్‌ఎండి. రఫీ,నాయకులు శేఖర్, వై. ప్రవీణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీధర్

నవరత్నాల మంజూరుతో మేలు: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు నిలిచిపోయిన వారందరికీ నవరత్నాలతో తిరిగి లబ్ధి కల్పించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె విజయ కృష్ణన్ తెలిపారు. నవరత్నాలు ద్వై వార్షిక నగదు మంజూరు కార్యక్రమాన్ని మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు బదిలీ చేశారు. ముఖ్యమంత్రి వీడియో సమావేశం ముగిసిన అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే కరణం బలరాం చేతుల మీదుగా లబ్ధిదారులకు నగదు చెక్కు పంపిణీ చేశారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. సంక్షేమ పథకాలు

నగదు చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

నిలిచిపోయిన వారికి మరలా ఇవ్వడం అభినందనీయమని అన్నారు. జిల్లాలో 4,944 మందికి రూ.7.76 కోట్లు నిధులు విడుదలయ్యాయన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ అయ్యిందన్నారు. మీరు పొందిన లబ్ధి మీ కుటుంబీకులకు, మీ పొరుగువారికి తెలియపరచాలని సూచించారు. అర్థాంతరంగా పథకం నిలిచిపోయిన వారు ఆందోళన చెందవద్దని, మీ సచివాలయాలలో సంప్రదించాలని కలెక్టర్ కోరారు. సంక్షేమ పథకాలలో మిగిలిపోయిన వారిని గుర్తించి, మరలా వారంతా లబ్ధి పొందేలా చేయడం సంతోషదాయకమని శాసన మండలి సభ్యులు లక్ష్మణరావు అన్నారు. పేదలపై ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చీరాల శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి అన్నారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్న వారికి వివిధ కారణాలతో ఆ పథకాలు నిలిచిపోతే వారిని విడిచిపెట్టకుండా మరలా గుర్తించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులు, డిఆర్‌డిఎ పీడీ బి అర్జునరావు, వ్యవసాయ శాఖ జెడి షేక్ అబ్దుల్ సత్తార్, సిపిఓ జి భరత్, వివిధ పథకాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి: రైతు సంఘం

ప్రజాశక్తి-పర్చూరు

రైతు సంఘం నాయకులు పర్చూరు మండలంలో దెబ్బతిన్న మిర్చి పంటలను పరిశీలించారు. మండలంలోని నూతలపాడులో మాండూస్ తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలను బాపట్ల జిల్లా రైతు సంఘం కార్యదర్శి తలపనేని రామారావు, సభ్యులు వి శ్రీనివాసరెడ్డి రైతులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఖరీఫ్‌లో 1350 ఎకరాల్లో మిర్చి సాగు చేశారని, రబీలో 600 ఎకరాల్లో మిర్చి సాగు చేశారని, ప్రస్తుతం బొబ్బర తెగులు ఆశించటంతో 3 వంతుల పంట దెబ్బతిందని ఆరోపించారు. పంటను వదులుకోలేక ఇంకా ఆశతో మందులు వాడుతున్నారని అన్నారు. గత సంవత్సరం మిర్చి వేసిన రైతులు తెగుళ్ళ సోకి అప్పులపాలయ్యారని, మార్కెట్ ధర ఆశాజనకంగా ఉండటంతో మరలా మిర్చి సాగు చేసి నష్టపోయినట్లు రైతులు పేర్కొన్నారన్నారు. ఉద్యాన శాఖాధికారులు, శాస్త్రవేత్తలు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చి మనో ధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. ఇటీవల పంగులూరు మండలంలో 150 ఎకరాలు వేసిన మిర్చిని తెగులుసోకి దెబ్బతినటంతో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంట సాగు చేశారన్నారు. బీమా పథకం వర్షాధారం కింద సాగు చేసిన వాటికే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, మిర్చి వేసిన రైతులందరికీ బీమా వర్తించేలా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారన్నారు. వీరి వెంట నూతలపాడు రైతులు ఉన్నారు.

జాబ్ మేళానుద్దేశించి మాట్లాడుతున్న క్రిష్ణంశెట్టి రమేష్

36 మందికి ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి-పర్చూరు

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడ్‌యాప్, మరియు ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో పర్చూరులో జాబ్ మేళా నిర్వహించారు. బిఏఆర్అండ్‌టిఏ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన జాబ్ మేళాలో మెడ్‌ప్లస్, హీరో మోటార్స్, ఐకాన్ ఎక్స్‌పీరియన్స్, కీర్తన ఫైనాన్స్ కంపెనీలు హాజరైనట్లు కళాశాల కరస్పాండెంట్ క్రిష్ణంశెట్టి రమేష్ బాబు వివరించారు. 104 మంది హాజరు కాగా 36 మందిని ఎంపిక చేసినట్లు రమేష్‌బాబు వివరించారు. మేళాలో ప్రిన్సిపాల్ రత్నకుమారి, షేక్ అహ్మద్‌బాషా, వైస్ ప్రిన్సిపాల్ చింపిరెడ్డి, సర్పంచ్ మల్ల అంజమ్మ, శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ ఎక్జిక్యూటివ్ డి రమేష్‌బాబు, ఏరియా కోఆర్డినేటర్ పి వినోద్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై సమీక్ష

ప్రజాశక్తి-నగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసి వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు పాల్గొన్నారు. మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందే విధానంపై ఆరా తీశారు. వాలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి గ్రామంలోని ప్రతి 50 కుటుంబాలకు ఒకరికి లబ్ధి కోసం ఏర్పాటు చేశారని, వచ్చే ఎన్నికలలో ప్రజల ఆశీస్సులు తప్పనిసరిగా

మాట్లాడుతున్న మోపిదేవి వెంకటరమణారావు

అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి తనయుడు రాజీవ్, ఎంపిపి శీకృష్ణయ్య, జెడ్పీటీసీ నాగమణి పిఎసిఎస్ చైర్మన్లు బి వెంకట్రామయ్య, బుల్లియ్య, సుధీర్, సర్పంచ్‌లు వెంకటేశ్వరరావు, రామకృష్ణ, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ విజయమ్మ

కరోనాను ఎదుర్కొనేందుకు సిద్ధం: డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-చీరాల: ప్రజలందరూ కోవిడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, మూడో వేవ్ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని బాపట్ల జిల్లా డిఎంహెచ్‌ఒ విజయమ్మ అన్నారు. మంగళవారం చీరాల ఏరియా ఆసుపత్రిని ఆమె పరిశీలించారు. తొలుత ఆసుపత్రిలోని కోవిడ్‌కు సంబంధించిన వార్డుతోపాటు ఆక్సిజన్ ఇంట్, సిలిండర్లు పరిశీలించి ఇతర సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పలు ఆసుపత్రులను తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆయా ఆసుపత్రుల్లో కోవిడ్ బాధితుల కోసం ఉండాల్సిన వసతులు, కావాల్సిన మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రతి సీహెచ్‌సీ పరిధిలో అనుమానితులకు, లక్షణాలు ఉన్నవారికి కోవిడ్ పరీక్షలను చేస్తున్నామని, అయితే ఇప్పటివరకే జిల్లాలో ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదని చెప్పారు. ప్రజలందరూ కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషుకుమార్ మాట్లాడుతూ చీరాల ఏరియా ఆసుపత్రిలో గతంలో వంద బెడ్లతో కోవిడ్ సేవలను అందించామని చెప్పారు. ప్రస్తుతం 90 బెడ్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అదేవిధంగా ఆక్సిజన్ ప్లాంట్‌తో పాటు, 100 సిలిండర్లు ఉన్నాయన్నారు. 10 ఐసీయూ బెడ్లను కూడా సిద్ధం చేస్తామని తెలియజేశారు. ప్రభుత్వ సూచనలతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోవిడ్‌ను ముందుగా ఎదుర్కొని వైరస్‌ను నియంత్రించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పి సుభాషిణి, రెండో నర్సు బుల్లెమ్మ తదితరులు ఉన్నారు.

గజల్ ప్రక్రియలో ఉద్దండులు మీర్జా గాలిబ్

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

గజల్ ప్రక్రియలో మీర్జా గాలిబ్ ఉద్దండులని బాపట్ల సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ పేర్కొన్నారు. బాపట్లలో మంగళవారం జరిగిన మీర్జా గాలిబ్ 225వ జయంతి సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఉర్దూ సాహిత్యంలో 'గజల్ 'ఒక అద్భుతమైన సాహిత్య ప్రక్రియ అని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో ప్రణయ, విరహ, ఆధ్యాత్మిక భావాలను మనోరంజకంగా ప్రకటించవచ్చని అన్నారు. గాలిబ్.. బహదూర్‌షా జఫర్ ఆస్థాన కవిగా విరాజిల్లారని పేర్కొన్నారు. ఆయన గజల్లను 'గాలిబ్ గీతాలు' పేరుతో దాశరథి తెలుగులో అనువదించారని అన్నారు. ఉర్దూ గజల్ ప్రభావంతో నారాయణరెడ్డి తదితర లబ్ధ ప్రతిష్ఠులయిన కవులు కూడా తెలుగులో గజల్ ప్రక్రియను ప్రారంభించారని పేర్కొన్నారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ మీర్జా గాలిబ్ రచించిన 'దీవానా-ఏ-గాలిబ్' అనే

మాట్లాడుతున్న సాహితీ భారతి నాయకులు

గ్రంథం ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిందని అన్నారు. ప్రముఖ నటులు మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ గాలిబ్ అసలు పేరు మీర్జా అసదుల్లా బేగ్ ఖాన్ అని, గాలిబ్ అనే కలం పేరుతో కవితలు రచించారని పేర్కొన్నారు. ఈ సభలో మర్రి మల్యాద్రిరావు, కీర్తి వెంకయ్య, ఎ జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, రెంటాల మురళి రాధాకృష్ణమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని గాలిబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఇంకొల్లులో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ భవనం శ్రీలక్ష్మి

38 మందికి ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: ఇంకొల్లు నల్లమోతు రామానుజమ్మ మరియు వెంకటసుబ్బారావు బాలికోన్నత పాఠశాల ఆవరణలో 8వ తరగతి చదువుతున్న 38 మందికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రధానోపాధ్యాయిని వి ఉదయకుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జడ్పీటీసీ సభ్యులు భవనం శ్రీలక్ష్మి, భవనం శ్రీనివాసరెడ్డి, ఎంపిపి బండారు అనూష హాజరై విద్యార్థినులకు ట్యాబ్‌లు అందజేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గురించి వివరించారు. బాగా చదువుకొని మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏజర్ల ప్రసన్న సైమన్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు తూమాటి చలమయ్య, ఎంపిటిసి సభ్యులు షేక్ ఆయేషాబుడే, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కె మల్లికార్జున్, కో-ఆప్షన్ సభ్యులు మేడూరి సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్జునరావు మృతికి సంతాపం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: ఇంకొల్లు రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్‌లో రావూరు అర్జునరావు మృతికి రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ అధ్యక్షులు మేడూరి సత్యనారాయణ అధ్యక్షతన సంతాప సభ జరిగింది. సంతాప సభలో భారత హేతువాద సంఘ అధ్యక్షులు కుర్రా హనుమంతరావు సంతాపం తెలియచేస్తూ అర్జునరావు జీవితం మనకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. భారత హేతువాద సంఘ ట్రెజరర్ షేక్ బాబు ప్రసంగిస్తూ అర్జునరావు దంపతులు అనేక హేతువాద అధ్యయన తరగతుల్లో పాల్గొన్నారన్నారు. సెంటర్ ప్రధాన కార్యదర్శి కరి హరిబాబు తమ సంతాప ప్రసంగంలో అర్జునరావు దంపతులు నాస్తికులుగా, హేతువాదులుగా ఆదర్శమైన జీవన సాగించారన్నారు. మేడూరి సత్యనారాయణ ప్రసంగిస్తూ అర్జునరావు ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ అధ్యక్షులుగా ఉద్యమానికి సేవలందించారని, రావిపూడికి మంచి మిత్రులని కొనియాడారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలి, బాపట్ల హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి కాకి రాజశేఖర్, పెంట్యాల రాజా, గాలి సంగీతరావు, తూమాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఓ రమేష్‌బాబు

చెత్త నుంచి సంపదకు కృషి చేయాలి: డిపిఓ

ప్రజాశక్తి-చెరుకుపల్లి: చెత్త నుంచి సంపదను సృష్టించేందుకు పంచాయతీలు కృషి చేయాలని డిపిఓ రమేష్‌బాబు సూచించారు. మంగళవారం చెరుకుపల్లి మండల కేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీలో ఆదాయ వనరుగా పరిగణించి చెత్త సంపద కేంద్రాన్ని విస్తృత పరిచి ఆదాయాన్ని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. త్వరలో రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల పరిధిలోని సిబ్బందికి శిక్షణ సమావేశాన్ని చెరుకుపల్లిలో ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిఎల్‌పిఓ శరత్, ఎంపీడీవో బి శ్రీనివాసరావు, కొల్లూరు ఎంపీడీవో ఐ సత్యనారాయణ, చెరుకుపల్లి ఈఓపిఆర్‌డి మురళీకృష్ణ, కార్యదర్శులు విజయబాబు, సురేష్, విజయానంద్ పాల్గొన్నారు.

రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో కార్మిక పోరాటం

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ

మాట్లాడుతున్న కారుసాల సుబ్బరామమ్మ

ప్రజాశక్తి-చీమకుర్తి

రైతాంగ ఉద్యమం స్ఫూర్తితో కార్మికవర్గం ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బూచే పల్లి కల్యాణ మండపంలో 12వ సిఐటియు జిల్లా మహాసభలను ఆమె ప్రారంభించి.. మాట్లాడారు. సభకు ఎం.రమేష్, జి.శ్రీనివాసులు, రాఘవమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. కారుసాల సుబ్బరామమ్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు నల్లచట్టాల రద్దు కోసం చేసిన ఉద్యమం స్ఫూర్తిదాయకమని, అదే స్ఫూర్తితో కార్మికవర్గం కూడా పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 27 కార్మిక చట్టాల స్థానంలో తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేసే వరకు మొక్కవోని ఉద్యమం సాగాలన్నారు. దేశవ్యాప్తంగా ఐసిడిఎస్ రంగాన్ని ప్రైవేటుపరం చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఆ ప్రయత్నాన్ని సిఐటియు పోరాటాల ద్వారా నిలువరిస్తోందన్నారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తోందన్నారు. ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తోందని చెప్పారు. మతోన్మాద ఎజెండా అమలు చేస్తూ దేశ ప్రజల మధ్య చీలికలు తీసుకురావడానికి ప్రజల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. కార్మికులు, ఉద్యోగులు సంఘటితంగా ఐక్య ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలన్నారు. హరించిన హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలన్నారు. కార్మికుల, ఉద్యోగుల ఉద్యమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న నిర్భంధాలను, అర్ధరాత్రి అరెస్టులు, నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం ఆమోదించారు. కార్యక్రమంలో సిఐటియు జెండాను దామా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రమేష్, చీకటి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు, జి.శ్రీనివాసరావు, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఎస్‌డి హనీఫ్, గ్రానైట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి.వీరాంజనేయులు, సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, జిల్లా నాయకులు పూసపాటి వెంకటరావు పాల్గొన్నారు.

అతి తక్కువ సమయంలోనే..

సిఎం పర్యటనకు పటిష్ట భద్రత

సిబ్బందిని అభినందించిన ఎస్పీ మల్లికగర్గ్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తల్లి థెరిసమ్మ అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి మంత్రి సురేష్ కుటుంబాన్ని పరామర్శించడానికి మంగళవారం యర్రగొండపాలెం వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని హెలిప్యాడ్ వద్ద జిల్లా ఎస్పీ మల్లికగర్గ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి యర్రగొండపాలెంలోని మంత్రి క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్‌ను పరామర్శించారు. థెరీసమ్మ మతి పట్ల సంతాపం తెలిపారు. మంత్రి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి తిరిగి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మల్లికగర్గ్ మాట్లాడుతూ అతి తక్కువ సమయంలోనే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన బందోబస్తు మరియు భద్రతా ఏర్పాట్లు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. రివార్డ్స్ ప్రకటించారు. ముందుగా జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ మల్లికగర్గ్, అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ ఆఫీసర్స్ కలిసి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ నిర్వహించి.. సిఎం పర్యటనకు అన్ని భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

హెలీప్యాడ్ నుంచి వస్తున్న సిఎం జగన్

సిఎం జగన్‌తో బాలినేని శ్రీనివాసరెడ్డి

హౌస్ అరెస్టులో ఆదినారాయణ కుటుంబం

అచ్యుత ఆదినారాయణ కుటుంబం హౌస్ అరెస్టు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా యర్రగొండపాలెం పట్టణంలో గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా హత్యకు గురైన రియల్ ఎస్టేట్ వ్యాపారి అచ్యుత ఆదినారాయణ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలవనీయకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వారిని హౌస్‌అరెస్టు చేశారు. వారి ఇంటి వద్ద ఉదయం నుంచి ముఖ్యమంత్రి యర్రగొండ పాలెం వచ్చి తిరిగి వెళ్లేంతవరకు పోలీసులు, మహిళా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆకట్టుకున్న కరోనా 'మాక్ డ్రిల్'

ఏర్పాట్లు పరిశీలించిన డిఎంహెచ్ఒ, రిమ్స్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కరోనా నాలుగో దశ వస్తే ఏవిధంగా ఎదుర్కోవాలనే విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మంగళవారం ఒంగోలులోని సమగ్ర సర్వజన వైద్యశాలలో నిర్వహించిన కరోనా మాక్ డ్రిల్ ఆకట్టుకుంది. కోవిడ్ కొత్త వేరియంట్ బిఎఫ్-7 నివారణకు ముందుస్తుగా జిజిహెచ్‌లో అందుబాటులో ఉన్న సాకర్యాలు బెడ్స్, ఆక్సిజన్ సిలిండర్స్, సిబ్బంది, మందులపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం కేసులు నమోదు కాకపోయినా గత అనుభవాల దృష్ట్యా అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కోవిడ్ పరీక్షలకు, చికిత్సకు అవసరమైన ఐసియు, నాన్ ఐసియు, సాధారణ పడకలు, ఆక్సిజన్ లేని ఐసియు పడకలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వెంటిలేటర్లు కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రజలందరూ కోవిడ్ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాస్క్ ధరించటం, సామాజిక దూరం పాటించడం, తరచూ శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కోవిడ్‌గా అనుమానం వచ్చిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వద్దులు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డి.సిహెచ్.ఎస్ డాక్టర్ నరసింహమూర్తి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్, జిజిహెచ్ ఆర్ఎంఒ డాక్టర్ చైతన్య, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, ఐడిఎస్‌పి మేనేజర్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

పేద విద్యార్థులకు

నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్‌షిప్ వరం

కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్‌షిప్ ఓ వరం లాంటిదని బాపట్ల కలెక్టర్ విజయకష్ణన్ అభిప్రాయ పడ్డారు. మంగళవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్లో జరిగిన కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు ఆర్థిక సహకారంతో తయారుచేసిన ఉచిత మెయిన్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల మెటీరియల్‌ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించడానికి ముందుకు రావడాన్ని ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే పరీక్షల్లో విద్యార్థుల విజయం సాధించేలా ఉపాధ్యాయులు కష్టపడి పనిచేయాలని సూచించారు. రూ.రెండు లక్షల విలువ గల మెటీరియల్‌ని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్సీ లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో చీరాల శాసనసభ్యులు కరణం బలరామకష్ణమూర్తి, బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె.రామారావు, సైన్స్ అధికారులు సాదిక్ మహమ్మద్, పవని భానుచంద్రమూర్తి శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అగ్రగామిగా ఆర్టీసీ కార్గో సేవలు

- సంక్రాంతికి ప్రత్యేక సర్వీసులు
- ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్‌రావు వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సరుకుల రవాణాలో అగ్రగామిగా ఉన్న ఆర్టీసి కార్గో సేవలను ప్రజలు మరింత వినియోగించుకోవాలని ఆర్టీసి ఆర్ఎం బి.సుధాకర్‌రావు కోరారు. స్థానిక ఆర్ఎం ఛాంబర్‌లో మంగళవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సరుకు రవాణాలో తనదైన ముద్ర వేసుకున్న ఎపిఎస్ఆర్టీసి కార్గో ప్రకాశం రీజియన్‌లో విజయవంతంగా నడుస్తుందన్నారు. 2017లో పూర్తి స్థాయిలో కార్గో, సరుకు రవాణాను ప్రారంభించిందని, తన సేవలతో వినియోగదారులను మెప్పించటమే కాక, దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. అతి తక్కువ సమయంలో సరుకు, పార్శిళ్ళను గమ్యస్థానాలకు చేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతుందన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక ఆర్టీసి బస్సులు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రకాశం రీజియన్‌లో ప్రత్యేక బస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసి రీజనల్ మేనేజర్ సుధాకర్‌రావు తెలిపారు. స్థానిక ఆర్ఎం ఛాంబర్‌లో మంగళవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది సంక్రాంతికి ప్రకాశం రీజియన్‌లోని 8 డిపోల పరిధిలో 330 ప్రత్యేక బస్సులను నిర్వహించామన్నారు. ఇందులో 190 బస్సులను సంక్రాంతికి ముందు, 150 బస్సులను సంక్రాంతి తరువాత నడిపామన్నారు. ఎక్కువ భాగం హైదరాబాద్‌కి ప్రత్యేక బస్సులు తిప్పామన్నారు. బెంగళూరు, చెన్నైలకు కూడా ప్రత్యేక బస్ సర్వీసులు నడిపామన్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రకాశం రీజియన్‌లోని 5 డిపోల పరిధిలో 230 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపేందుకు ప్రణాళికలు రచించామన్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలకు ప్రత్యేక బస్సులు తిప్పుతామన్నారు. అదనపు ఛార్జీలు లేకుండా పాత టిక్కెట్ ధరలను అమలుచేస్తామన్నారు. మరిన్ని అదనపు సర్వీసులు నడిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రయాణీకులు ఆర్టీసి కల్పిస్తున్న సౌకర్యాన్ని వినియోగించుకొని సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆర్టీసి ఆర్ఎం కోరారు.

ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్‌రావు